క్లుప్తంగా

సంతోషిమాతకు హోమాలు



సకలదేవతా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి జన్మదినం సందర్భంగా జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం హోమాలు, పారాయణలు జరిగాయి. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాతసేవ, క్షీరాభిషేకాలు, శ్రీసూక్త విధానేన షోడశోపచార సహిత సహస్రనామ కుంకుమార్చనలు, సూర్యనమస్కారాలు, శ్రీచక్రార్చన, నవచండీ పారాయణ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, సకలదేవతలకు హవనం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేఖా చిత్రకారుడికి సత్కారం



చిత్రకారుడుని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని మజీ పాత్రుని క్రియేట్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ రేఖా చిత్రకారుడు బూర్ల కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంసీఏ అధినేత నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కోటేశ్వరరావుది రేఖా చిత్రంలో అందెవేసిన చేయ్యని కొనియాడారు. అనంతరం చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు చిత్రకళలో మెళకువలను తెలియచేశారు. కార్యక్రమంలో ఎన్‌టీవీఆర్ మూర్తి, రాజీ నాయుడు పాల్గొన్నారు.

పలకలు తీశారు.. అమరిక మరిచారు..



రైతుబజారు వద్ద ప్రమాదకరంగా ఉన్న పలకలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని పలుచోట్ల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టంపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎక్కడికక్కడ కాలువలపై తీసిన పలకలను పనులు చేసిన తరువాత నచ్చినట్లుగా వేసి వదిలేస్తున్నారు. దీంతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన కూడళ్లు రైతుబజారు, డే అండ్ నైట్, చిన్నబజారు రోడ్డు, సరస్వతి మహల్ రోడ్డులో ఇలా చాలా చోట్ల తీసిన పలకలు సరిగ్గా అమర్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత సిబ్బంది స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

హిందుత్వ పరిరక్షణకు కృషి

రణస్థలం: హిందుత్వ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని తాళ్లవలస ముప్పిడి నారాయణరావు గురుభవాని, కొవ్వ సూరప్పడు గురుభవాని తెలిపారు. లావేరు, రణస్థలం మండలాలకు చెందిన సివిల్ భవానీలు కోటపాలెం భద్రమహంకాళీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలాధారణ వేసిన 41 రోజుల కాకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లోనూ పర్యటించి హిందుత్వ బలోపేత దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల భవానీలు పాల్గొన్నారు.

పార్వతీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న పార్వతీదేవి

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామంలో గల ఉమారామలింగేశ్వర దేవస్థానంలో పార్వతీదేవికి ఆషాఢ శుద్ధ అష్టమి సందర్భంగా గ్రామ ప్రజల సుభిక్షం కోరుతూ పలు ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. ప్రధాన అర్చకులు అరవెల్లి సురేష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జగన్నాథా..కాపాడయ్యా..



గుజరాతీపేటలో సత్యన్నారాయణ స్వామిగా జగన్నాథుడు



ఇల్లీసుపురంలో కృష్ణా అవతారంలో..



పాండ్రంగి వీధిలో సత్యన్నారాయణ స్వామిగా..



మొండేటివీధిలో శ్రీకృష్ణావతారంలో..

జగన్నాథస్వామి రథోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని దర్శించుకున్న భక్తులు జగన్నాథా..కాపాడాయ్యా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కాగా సుభద్ర, బలభద్రులతో పాటు జగన్నాథస్వామిని వివిధ రూపాల్లో అర్చకులు అలంకరించారు. గుజరాతీపేటలోని జగన్నాథస్వామి దేవాలయంలో స్వామిని సత్యన్నారాయణ స్వామిగా, ఇల్లీసుపురం కూడలిలోని గుడించాలో కృష్ణావతారంలో, పాండ్రంగివీధిలోని రామమందిరంలో సత్యన్నారాయణ స్వామిగా, మొండేటి వీధిలోని లలితా సమేత శివకామేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో స్వామివారిని కృష్ణావతారంలో అలంకరించారు.

–శ్రీకాకుళం కల్చరల్

గరిమెళ్లకు ఘనంగా నివాళి



గరిమెళ్ల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సాహితీ వేత్త గరిమెళ్ల సత్యన్నారాయణ జయంతి సందర్భంగా తెలుగు రచయితల వేదిక సభ్యులు ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెరవే కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ.. తన కలం, గళంతో పాటలను గొంతెత్తిపాడి తెల్లదొరలను ఎదిరించిన గొప్ప దేశభక్తుడు గరిమెళ్ల అని కొనియాడారు. వేదిక ప్రతినిధి మంగిపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గరిమెళ్ల శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాడు కావడం గర్వకారణమన్నారు. పూడి జనార్దనరావు పాశ్యపు స్వంలో ఉన్న గరిమెళ్ల రచించిన మాకొద్దీ తెల్లదొరతనం పాటను గానం చేశారు. ఉమాకవి దండాలోయ్‌బాబు, దండాలోయ్ గరిమెళ్లకు, కవితను వినిపించారు. జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలపైన గరిమెళ్ల అనేక పుస్తకాలు రచించారని, ఆయనకు సరైన గుర్తింపు లేదని అన్నారు. కార్యక్రమంలో తెరవే సభ్యులు ఐఎన్‌డీ ప్రసాద్, కె.సూర్యనారాయణ, బాలాజీ రవికిరణ్, కిమ్మి సంతోష్, బి.జగన్నాథం పాల్గొన్నారు.

అభినయ నృత్య నికేతన్ బృందానికి అవార్డులు



అవార్డులతో అభినయ నృత్యనికేతన్ బృందం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన అభినయ నృత్య కేతన్ డాక్టర్ నీరజ సుబ్రహ్మణ్యం బృందానికి నాట్యరవళి జాతీయ అవార్డులు వచ్చాయి. విశాఖకు చెందిన నాట్యరవళి మ్యూజిక్ అండ్ డన్స్ అకాడమీ విశాఖలోని కళాభారతిలో మూడురోజులు 35వ జాతీయ స్థాయి కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఫోక్ తదితర నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అభినయ నృత్య నికేతన్ శిష్య బృందం కె.సింధు శ్రీహర్షిత కూచిపూడి, భరతనాట్యంలో ప్రథమ బహుమతిని, సెమీక్లాసికల్ ఫోక్‌లో ద్వితీయ బహుమతులు సాధించారు. జూనియర్స్ విభాగంలో డి.విశిష్ట కూచిపూడి ప్రథమ, సెమిక్లాసికల్ ప్రత్యేక బహుమతి, సబ్ జూనియర్స్ విభాగంలో సమ్మశ్రీ క్లాసికల్ ప్రథమ, సెమిక్లాసికల్ రెండవ బహుమతి, శ్రీనిధి ఫోక్‌లో తృతీయం, జూనియర్స్‌లో భరతనాట్యంలో వైష్ణవి ద్వితీయం, విధిజ్ఞ తృతీయ, జూనియర్స్ ఫోక్‌లో అక్షయ, యశస్విని తృతీయ, ఊర్మిళ సెమీ క్లాసికల్ తృతీయం, ఉషశ్రీ, కృతిక్ష యామిని, లోకేశ్వరి, ప్రదీతి, వైష్ణవి, క్షీరజ్ తదితరులకు కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. మొత్తంగా 32 బహుమతులు సాధించారని నీరజ తెలిపారు. వీటిని ఆంధ్రా యూనివర్సిటీ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ రామారావు, ప్రముఖ నాట్యాచార్యులు నటరాజ పరమేశ్వరన్, తులసీదాస్, నాట్య రవళి అధ్యక్షులు ఉమ్మడి మహేష్ బాబు, వ్యాపారవేత్త ప్రసాద్, సమ్మార్టి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



అంజనేయుల్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం అర్బన్: జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల పర్యటనలో భాగంగా స్థానిక ఎన్జీఓ హోంలో ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న దారుణాలు, అవినీతిని వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పాత్రికేయులదేనన్నారు. పాత్రికేయులకు టీడీపీ మొదటి నుంచి సముచితంగా గౌరవిస్తోందని.. కూటమి ప్రభుత్వంలోను అదే గుర్తింపు, గౌరవం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే జర్నలిస్టుల హెల్త్ స్కీంను పొడిగించినట్టు పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఏజే జాతీయ నాయకులు జి.ఆంజనేయులు మాట్లాడుతూ.. 13 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం అమలవుతోందని.. ఇదే తరహాలో ఏపీలో పింఛన్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు సమగ్రమైన విధానాన్ని అమలు చేయాలన్నారు. అక్రిడియేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు స్థానం కల్పించాలన్నారు. అనంతరం గాంధీ స్మృతివనంలో ప్రజాకవి గరిమెల్ల సత్యన్నారాయణ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూజేఎఫ్ విశాఖ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జోగినాయుడు, సత్తారు భాస్కరరావు, పి.నారాయణరావు, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జర్నలిస్టు సంఘాల నాయకులు సదాశివుని కృష్ణ, షణ్ముఖరావు, రొతు సూర్యనారాయణ, సీపాన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి మురుగునీరు!



పుణ్యపువీధిలో మురుగునీటిలో ప్రయాణిస్తున్న దృశ్యం



నానుబాలవీధిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని పుణ్యపువీధి, నానుబాలవీధుల్లో కాలువల నీరు రోడ్లపైకి వచ్చి చేరుతుంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో మురుగునీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. పుణ్యపువీధిలో స్కూల్ ఉంది. ఇక్కడ పిల్లలంతా రోజూ మురుగునీటిలో నుంచే వెళ్తున్నారు. కొంత మంది జారిపడిపోతుండడంతో చర్మవ్యాధులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే దోమలు, పందులు స్వైర్యవిహారం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీనులవిందుగా సంగీత విభావరి



గాయనీ గాయకులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: విశాఖకు చెందిన నారీభేరి సంగీత సంస్థ, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు సంయుక్త నిర్వహణలో స్థానిక ఎన్జీవో హోమ్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి వీనుల విందుగాసాగింది. సంధ్య వేళ– సరాగాల హేల పేరిట ప్రముఖ గాయని కింతలి భాగ్యలక్ష్మి నేతృత్వంలో గాయని గాయకులు శైలజ మెరాజ్, పుండరికుమార్, కింతలి సూర్యప్రకాష్, చింతా వేంకటేశ్వరరావు, భూషణ్, రామ్మోహన్ రావులు చక్కనైన గీతాలను ఆలపించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ట్రస్టు చైర్మన్ కొంక్యాన వేణుగోపాల్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ట్రస్టు తరఫున గాయనీ గాయకులను సత్కరించారు. కార్యక్రమంలో వితాన తరంగిణి జిల్లా కన్వీనర్ ఎం ఉషశ్రీ, జేసీఐ ప్రతినిధి బందాలం వరలక్ష్మి పాల్గొన్నారు.

సంతసీతారంపురంలో పారిశుద్ధ్య పనులు



కాలువను శుభ్రం చేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురం గ్రామంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. డ్రైనేజీల్లో ముదుగు తొలగించారు. కాలువలు, వీధులు శుభ్రం చేశారు. బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. వర్షాకాలం కావటంతో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దంప అప్పయ్యమ్మ పర్యవేక్షించారు.

కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం గ్రామంలో అడ్డ పిక్కల ఆటపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామంలో పర్యటించారు. వీధిలో అడ్డపిక్కలు ఆడుతుండటంతో ఆట సామగ్రి, రూ.1,800 స్వాధీనం చేసుకొని, ఒకరిపై కేసు నమోదు చేశారు.

పొలం పనుల్లో బిజీ..బిజీ



గొప్పు తవ్వుతున్న రైతులు

జి.సిగడాం: మండలంలోని మెట్ట ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో రైతులు పంటలు వేసి గొప్పులు తవ్వుతున్నారు. కూలీలు దొరకక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఒక్కొక్క కూలీకి రోజుకి రూ.300 చెల్లిస్తున్నట్లు రైతులు తెలిపారు. మండలంలోని సీతంపేట, జగన్నాథవలస, పాలఖండ్యాం, పెంట, గెడ్డకంచరాం, బాతువ, డీఆర్‌వలస, సిద్దాం, పున్నాం, సర్వేశ్వరపురం, జాడ, ఎందువ తదితర గ్రామాల రైతులు పొలం పనుల్లో బిజీ.. బిజీగా ఉన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల: యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందదాయకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. లావేరు మండలంలోని గురుగుబిల్లి గ్రామంలో మహా మాధురీ చారిటబుల్ ట్రస్టును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన యువతను అభినందించారు. నిర్వాహకులు జాన్ దండాసి, అప్పలసూరి, యువకులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి



గోతులు మయంగా ఉన్న రోడ్డు

ఎచ్చెర్ల క్యాంపస్: పాత జాతీయ రహదారి ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి వెళ్లే తారు రోడ్డు రెండు కిలో మీటర్లు ఉంది. ఈ రోడ్డును గతంలో మరమ్మతులు నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టు సంస్థ తాత్కాలిక నిర్మాణ సామగ్రి తయారీ యూనిట్ సమీపంలోని 100 మీటర్లు వరకు రోడ్డు నిర్మాణం చేపట్ట కుండా అసంపూర్తిగా విడిచిపెట్టారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. రోడ్డు మొత్తం గోతులు మయంగా మారింది. రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని విద్యార్థులు, వాహనచోదకులు కోరుతున్నారు.

నాలుగు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఒకేవేదికపై పూర్వ విద్యార్థులు

గార: నాలుగు దశాబ్దాల తరువాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. దీనికి చదువుకున్న కళాశాలే వేదికైంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళింగపట్నం కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1984–85 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం కళాశాల ఆవరణలో కలుసుకున్నారు. వేర్వేరు వృత్తుల్లో.. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడినవారంతా ఒక చోట కలుసుకొని చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని సందడిగా గడిపారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు.

ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం



అవార్డు అందుకుంటున్న పి.వి.ఎస్.ఎన్.మూర్తి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి నైరా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న పి.వి.ఎస్.ఎన్.మూర్తికి అరుదైన గౌరవం లభించింది. భువనేశ్వర్‌లో జ్ఞాన ప్రకాశ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భారతీయ విద్యలో భాష, సంస్కృతిల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మూర్తి పాల్గొని ప్రసంగించారు. దీంతో ప్రశంసాపత్రం జ్ఞాన ప్రకాశ్ పరివార్ అవార్డును నిర్వహకులు అందజేశారు. శ్రీకాకుళం మండల ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు మూర్తికి అభినందనలు తెలియజేశారు.


బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు నెల్లి దివ్య, యాండవ భవానీలు శ్రీకాకుళం జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్ (19) డబుల్స్ విభాగంలో ప్రతిభ కనబరిచి రన్నర్స్‌గా నిలిచారు. వీరిని స్థానిక సర్పంచ్ యల్లం నాయుడు, హెచ్‌ఎం ఎస్.అరుణకుమారి, పీడీలు సూర్యారావు, సీతారామరాజు, జోగరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వారాహి అమ్మవారికి దీపోత్సవం



దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నది ఒడ్డున ఉన్న బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం దీపోత్సవం నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, యంత్రపూజ, ద్వాదశ హారతులు ఇచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక



కిరణ్మయి, జ్ఞానసృతి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని పాతహౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు బీజేఎస్ కిరణ్మయి, ఎ.జ్ఞానసృతి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిని స్కూల్ డైరెక్టర్ ఎ.లావణ్యరాణి, ప్రిన్సిపాల్ బి.కిరణ్‌కుమార్, సౌజన్య, దేవి, దీపకుమారి, విజయ అభినందించారు.

అమ్మవారి ఉత్సవాలకు అలంకరణ



విద్యుత్ దీపాల అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్

నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న పెద్దరెల్లివీధిలోని అసిరితల్లి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా విద్యుత్ అలంకరణ చేశారు. సోమవారం జరిగే ఉత్సవాలకు సంబంధించి రోడ్డుకు రెండు వైపులా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.